
# అమ్మా! నువ్వు ఓడిపోలేదు




— డి. శారద

అయినవాళ్ళ మాటలు విన్నన్నాళ్ళు నాకు పిల్లలు బ్రతకనేలేదు. వాళ్ళ మాటలు వినడం మానేసిన తరవాతే నువ్వు దక్కావు." అంటూ కళ్ళ నీళ్ళతో దీనంగా చెపుతూంటే, తను నిజమే అనుకునేవాడు. అయినా అమ్మ చెప్పినంత క్రూరత్వం తనకి ఆయిన వాళ్ళలో కనిపించేది కాదు. తను వస్తేనే చాలన్నట్లుగా వాళ్ళు ఆప్యాయంగా ఆదరించేవారు. అమ్మ చెప్పినట్లుగా వాళ్ళు ఒక్క నాడు తనకి కాని కమాటలు గానీ, అమ్మమీద చాడీలుగానీ చెప్పలేదు. అయినా 'అమ్మకి వాళ్ళంటే కోపం. నువ్వెళ్ళకు' అని నాన్న చెపితే తను అంతేనేమో, నాకు తెలియదేమో, అమ్మ అబద్ధం ఎందుకు చెపుతుంది! అనుకున్నాడుగానీ, అమ్మా, నాన్నా తనని ఇంత మోసంచేస్తారని అనుకోలేదు. వాళ్ళ కిష్టం అయితే పెంచుకోవచ్చు. దాని కెవరు కాదంటారు. కానీ, మరీ ఇంత అన్యాయమా! తల్లీ, తండ్రీ తామే అయినట్లుగా, నవమాసాలు మోసి కన్న తల్లినీ, తండ్రినీ తోటకూర కుడితో పుచ్చు ఆకును పారేసి మంచిఆకును తీసుకున్నట్లుగా తలి దండ్రుల్ని తోసిపారేసి కన్ను తీసుకు పోవటమా? ఏ జన్మలో ఎవరిని, ఎవరికి దూరం చేశారో, ఏ తల్లికి ఏ బిడ్డని కాకుండా దూరంచేశారో! ఈ జన్మలో కడుపు ఫలించి పుట్టిన బిడ్డ పుట్టినట్లుగానే దూరం అయ్యాడు. ఇంకా ఈ జన్మలో కూడా పాలు త్రాగే పసివాడిని తల్లి నుండి వేరు చేసి ఇంకా మాటగట్టు కుంటున్నారు.

నీ తలిదండ్రులు ఫలానా, మేము నిన్ను పెంచుకున్నాము, నాయనా! అని ప్రేమతో అంటే తను కాదంటాడా? ద్రోహంతో వెన్నయినా తినిపించలేరట. హితం మీద విషమైనా త్రాగించవచ్చుట. ఇట్లాగే కన్న వాళ్లని త్రోసి పారేసి, తమనే తలిదండ్రులనుకోమని గొడవచేసి ఉంటారు. నాకంటే ముందు పెంపు వచ్చిన మురళీ అన్నయ్యని బుద్ధి తెలిసిన తరవాత బలవంతంగా అమ్మా, నాన్నా అనిపించుకోవడం ఎంత కష్టం! అందుకే వాడు వీళ్ళను కాదని వెళ్ళిపోయాడని ఈనాటికీ అమ్మ వాడిని తిడుతూనే ఉంటుంది. అవును, మరి వెళ్ళక ఏం చేస్తాడు? నించుంటే వాళ్ల ఇష్టం మీదే నించోవాలి. కూర్చున్నా వాళ్లని అడిగే కూర్చోవాలి అంటే ఎవరుమాత్రం భరిస్తారు? తనకైనా అంతేగా! వీధిలో ఎవరితోనైనా మాట్లాడాలి అంటే అమ్మ పెర్మిషన్ ఉండవలసిందేగా! ఇన్నేళ్లు వచ్చాయి. కాలేజీకి ఫలానా చొక్కా వేసుకొని వెళ్ళు అని అమ్మ ఇవ్వాలి, తను వేసుకోవాలి. అంతే గానీ, ఇంకో చొక్కా వేసుకోకూడదు. ఎవరికి మంచినీళ్ళు ఎన్ని త్రాగాలో కూడా వాళ్ళే నిర్ణయించాలాయె. ఎక్కువ నీళ్ల త్రాగితే ఒళ్ళు వస్తుందట. అందుకని లిమిట్‌గా త్రాగమంటుంది అమ్మ.

అసలు అమ్మే అన్నిటికీ కారణం. ఆవిడన్న ప్రతి మాటకీ సరే అనడమే నాన్న పని. కర్మచాలక ఏదన్నా కాదంటే ఇహ ఆపూట రామరావణ యుద్ధమే కొంపలో! ఆ కేకలు, అరుపులు, సాధింపులు భరించలేక తనుగానీ, నాన్నగానీ ఎదురుచెప్పరు. ఆవిడ మాటకి ఇప్పుడు ఇంటికి వెళ్ళగానే రాత్రి రానందుకు ఎంత గొడవచేస్తుందో! ప్రతి చిన్న విషయానికీ రాద్ధాంతాలు, సిద్ధాంతాలు చెయ్యడం ఆవిడకి అలవాటు. మొన్నటికి మొన్న తను పేలు దువ్వ కొనే కొమ్ము దువ్వెనతో తల దువ్వుకున్నందుకు ఎంత గొడవ చేసింది? రాము బయటనించి అంతా విని, 'ఏం గోలరా! మా అమ్మ అయితే ఎంత మంచిది, ఒక్క మాట అనదు. ఎంత ప్రేమగా చూస్తుంది! నీ ఖర్మ—ఇలాంటి దాని చేతిలో పడ్డావు' అన్నాడు. ఆ మాటలతోనే తనకి ఎంత త్వరగా అమ్మని చూద్దామా అనిపించింది. అయినా స్వంత తలిదండ్రులనుకొని వాళ్ళు ఎన్ని చేస్తున్నా, ఏం చేసినా భరించక చేసేదేం లేదని ఇన్నాళ్ళూ నోరుమూసుకుని ఊరుకున్నాడు గానీ, ఎప్పుడైతే వాళ్ళు నా వాళ్ళు కారు అని తెలిసిందో, అప్పటి నుంచీ వాళ్ళు చేసేది ప్రతిదీ అసహ్యంగా, భరించలేనిదిగా అనిపిస్తూంది. ఇలాంటి సమయంలో ఇంక వాళ్ళదగ్గర ఉండటం అసంభవం? వాళ్ళకి ఎంత డబ్బైనా ఉండుగాక, దానితో తనకేం నిమిత్తం లేదు. ప్రేమా, మంచీ లేని కాడికి తనకెందుకు? ఇంత మంచి అమ్మ ఇక్కడ ఉంటే, డబ్బులేకపోతేమాత్రం ఏం? నా కున్న సర్టిఫికెట్లతో ఏదో ఒక ఉద్యోగం సంపాదిస్తాను. అమ్మ దగ్గరే ఉంటాను. అమ్మతో చెపుతాను' అను కుని పక్కమీంచి లేచాడు శ్రీనాథుడు.

అప్పటికి బాగా తెల్లవారిపోయింది. బాలభానుడి బంగారు కిరణాలు మంచు బిందువులతో కప్పబడిన పూల మొక్కల మీద పడి మెరుస్తున్నాయి. ఆ దొడ్డి ఆవరణ ఏమంత పెద్దది కాదు. తమ ఇంటి దొడ్డితో పోలిస్తే అతి చిన్నది. తమది ఎంత విశాలమైన దొడ్డి! అయినా అందులో పనికివచ్చే మొక్క ఒక్కటీ లేదు. ఓ పక్క పెద్ద సంపంగి పొద. మరోవైపు సపోటా మొక్క. ఇంకోవైపు ఆరోగ్యానికి మంచిదని అమ్మ కావాలని పెంచిన వేపచెట్టు. దాని జతనే రావి చెట్టు. మహావృక్షాలై మరో మొక్కని మొలవనియ్యవు. ఇంకా అక్కడక్కడ పూలమొక్కలతో గజిబిజిగా ఉంటుందే గానీ, ఇట్లా తీర్చిదిద్దిన పూలమొక్కలు కాయగూరలతో కన్నుల పండువుగా ఉండనే ఉండదు. ఇట్లా ప్రతి దానికీ కన్నవారికీ, పెంచిన వారికీ మధ్యగల తారతమ్యాలు మననం చేసుకొంటూ దొడ్లో అడుగు పెట్టాడు శ్రీనాథుడు.

"అమ్మా! అమ్మా!" అంటూ వచ్చిన తమ్ముడికి మొహంపుల్లా, చెంబుతో నీళ్ళు అందించింది అక్కగారు నల్లమ్మ. "అమ్మేది" అనడిగిన తమ్ముడికి సంగీత పాఠం చెప్పడానికి వెళ్ళిందని చెప్పింది. ఆ మాటతో మనస్సు చిన్నబోగా, మారు మాట్లాడకుండా మొహం కడుక్కు వచ్చాడు శ్రీనాథుడు. ఆవిర్లు గక్కుతున్న ఇడ్లీలు అతని ముందు పెట్టింది నల్లమ్మ. అవితిని, కాఫీ త్రాగి, "అమ్మ ఎప్పుడొస్తుందో" అని అడిగాడు నల్లమ్మని.


"అమ్మ పది గంటలకి వస్తుంది. ఇది నీ కిమ్మంది" అంటూ రెండు కాగితాలు తెచ్చి ఇచ్చింది నల్లమ్మ. ఆత్రతగా వాటిని విప్పాడు శ్రీనాథుడు.

"శ్రీనాథమూర్తి! నా కన్నయ్యా! భగవానుడు నీకు దృఢచిత్తం, మనస్స్థైర్యం కలిగించుగాక! అని దీవిస్తున్నాను, కన్నా!

నా తండ్రీ! ఎన్నాళ్ళకో నా కంట పడ్డావు. ఇంకీ జన్మకి నిన్ను చూడననే అనుకున్నాను. కానీ రాము పుణ్యమా అంటూ నిన్ను కన్నులారా చూశాను, చాలు. ఈ జన్మకిది చాలురా, తండ్రీ! ఇంకేమీ నే మంచి ఆశించను. ఏణ్ణర్థం పిల్లడుగా, నవ్వుగా, పీచులా రోజులు దగ్గర పడ్డట్టున్న పిల్లాడిని నిన్ను కామేశ్వరమ్మగారి చేతిలో పెట్టాను. తిరిగి ఈనాడు పది హేడేళ్ళకి కన్నుల కింపైన నిన్ను, నా ప్రతిరూపంగా తయారైన నిన్ను చూశాను. చెప్పలేని ఆనందం అనుభవించానురా, నాన్నా! అంత ఆనందాన్ని భరించలేకనే, అయిదేళ్ళుగా రాని

## పల్లెపట్టు

చిత్రం — సారథి (మద్రాసు—44)



మంచి ఎట్లాగైనా తప్పుకుపోవాలని చూస్తున్నావనీ, ఇప్పుడు కనక నిన్ను చేరదీస్తే నీ ఆస్తి నీకు వస్తుందనీ రాత్రి రాము అన్నాడు. నా తండ్రీ! నిన్ను ఆస్తికోసమా నేను వాళ్లకి ఇచ్చింది! విడీవిడని మొగ్గ ఇప్పటి నీ వయస్సు. ఇప్పుడు గనక నువ్వు నీ అన్నల కబంధ హస్తాల్లో చిక్కుకున్నావంటే, ఇంక నీకు మోక్షం లేదు. నీ జీవిత సౌరభాన్ని నిర్దాక్షిణ్యంగా నేలరాయటానికి ఎవరికీ ఏమీ సందేహం ఉండదు. ఇది నిజం. నేను నిన్ను వాళ్ల దగ్గరికి బలవంతంగా నయినా పంపాలని వ్రాసే వ్రాతగాదు. ఉన్న విషయం నీ ముందు ఉంచుతున్నాను.

కన్నయ్యా! కామేశ్వరమ్మ గారు నిన్ను మరీ హద్దుల్లో ఉంచవచ్చు. మరే గిరి దాటనివ్వక పోవచ్చుకానీ, నీకు చెడుగా ఏం చెయ్యలేదు. నీ వ్యక్తిత్వం, నీ ఆలోచనలు నీవి నీకే ఉంటాయి. మరో నాలుగేళ్ళు పోతే నీ మనస్సు పరిణతి చెందుతుంది. నీ అనుభవం పెరుగుతుంది. అప్పుడు నీ కేది మంచిదని తోస్తే అది చెయ్యి. నా తండ్రీ! నా ఆశా, నా గొప్పా, నా జీవితకామనీ—అన్నీ నీమీదే పెట్టుకుని బ్రతుకు ఈడ్చుకొస్తున్నాను. నువ్వు గూడా నీ అన్నల లాగా చపలచిత్తుడివి అవుతావా? ఇప్పుడు నీకు కామేశ్వరమ్మ గారి నుండి క్రొత్తగా ఏం కష్టాలొచ్చాయి? ఇదివరకు నుంచీ ఉన్నవేగా, ఏ ఆసరా చూసుకొని నువ్వు ఆవిడనుంచి తప్పుకోవాలనుకుంటున్నావో, ఆ ఆసరా నిన్ను నడి సముద్రాన వదిలి వేసేందు కేమీ జంకదు. అప్పుడే నువ్వు నీ రాము అన్నయ్య మాటల చాతుర్యంలో పడి, ఇన్నాళ్ళ నుంచీ పెంచిన తల్లితండ్రులతో మాట మాత్రంగా చెప్పకుండా వచ్చావు. సరే, దానికేమిలే! వచ్చావు. బాగానే ఉంది. ఇంతమాత్రానికే నే నేమీ అనను. కానీ, కన్నయ్యా! ఈ పరిచయం ఇంతటితో ఆపెయ్యమంటున్నాను. నీ రాము అన్నయ్యని మళ్లీ మళ్లీ కలవ వద్దని చెప్పడం వరకే, బాబూ, నేను చెయ్యగలిగింది. పెంపుడు తండ్రి పెంచిన కండలతో పాటు నీలో ఏ కొంచెమైనా వివేకం పెరిగితే, నా అదృష్టం నేను భగవానుడు పెట్టిన ఈ చివరి పరీక్షలో నెగ్గుతాను.— నాన్నా! ఇంతకంటే ఏం వ్రాయను కన్న



కొమ్ములు

ఫోటో — ఎస్. అన్వర్‌భాషా (చందోలు)

బిడ్డ అమ్మా అంటూ కాళ్లదగ్గరికొస్తే. కాదు పొమ్మనే నా దౌర్భాగ్యాన్ని నిందించుకోనా? ఈ జన్మలో మరి కళ్లబడ డనుకున్న నా శ్రీనాథుడు నా కన్నుల పండువ చేస్తూ కనిపించినందుకు ఆనందించనా! కన్నా! ఇది, నాన్నా, నీ జీవితం! నేను కావాలనే నా రత్నాన్ని కామేశ్వరమ్మ గారికి అప్పజెప్పాను. ఈ దుర్భరమైన దారిద్ర్యం, కలుషిత వాతావరణం ఛాయ గూడా నా రత్నం మీద పడకూడదని కావాలనే అట్లా కట్టడిచేశాను. కన్నయ్యా! నువ్వు నాకోసం ఆగక్కర్లేదు. నా దీవెన నీకు సర్వకాల సర్వావస్థలయందు ఉంటుంది. నీ నిర్ణయం త్వరగా తేల్చుకో! నిర్భాయురాలైన నీ తల్లిని మరిచిపో! కన్నయ్యా! నా తండ్రీ! నా శ్రీనాథా! నీ శ్రేయస్సూ, నీ సౌభాగ్యం, నీ ఆయురారోగ్యం సదా కాంక్షించే కఠినురాలైన నీ కన్నతల్లి

—రాజేశ్వరమ్మ."

సుదీర్ఘమైన ఆ లేఖను పూర్తి చేసేసరికి శ్రీనాథుడి కళ్లనుండి అవిరళంగా కన్నీరు కారింది. రెండు నిమిషాలట్లా నిరుత్తరుడై నిలబడిపోయాడు. కొన్ని నిమిషాల క్రితమే తన కన్నుల పండుగ జేసిన పొదులన్నీ మసక మసగ్గా కనపడుతూ అంతా అయోమయంగా బుర్ర తిరిగిపోసాగింది. ఇంక అమ్మ దగ్గరకు వచ్చేశాను కదా! హాయిగా, స్వతంత్రంగా ఉండవచ్చునని ఎన్ని ఆశా సౌధాలు కట్టాడు! అవన్నీ ఒక్కసారిగా నేలమట్టం అయిపోయాయి. ఒక్కపూట-ఆ ఒక్క పూటలోనే అమ్మ చూపిన ఆప్యాయత, ఆ మమకారం త న్నెక్కడికో తేల్చిపారేసింది. ఆ ప్రేమ వాహినిలో గడ్డిపోచలా తను కొట్టుకుపోయాడు. తీయని కల లెన్నో సృష్టించుకున్నాడు. ఇంక నిర్ణయించుకున్నాను. అమ్మని విడిచి వెళ్లక్కరలేదని ఎన్నెన్నో ఆశా సౌధాలు ఆకాశపు టంచుల్ని తాకుతూ వెళ్లాయి. కానీ, అమ్మ స్థితి, అమ్మ కోర్కె, అమ్మ ఆశయం అన్నిటినీ కూల్చేశాయి.

"అమ్మా! అమ్మా! ఎందుకుచూపించావమ్మా! నీ ఆప్యాయతలో ఉండే ఈ మధురిమ, నా కెందుకు చవిచూపించావు? నేనేం చెయ్యను నిప్పుడు? నిన్ను విడిచి నే నెట్లా వెళ్లగలను" అంటూ ఒక్కసారి రెండు చేతుల్లో మొహం దాచుకుని బావురుమన్నాడు శ్రీనాథుడు. కుమిలిపోతున్న తమ్ముడి తలమీద చెయ్యి వేసి నిమురుతూ, "అమ్మ చెప్పినట్లు విను, తమ్ముడూ!" అంటూ ముద్దు ముద్దుగా మాట్లాడుతూ తనూ కళ్లనీళ్లు పెట్టుకుంది నల్లమ్మ. అమాయకురాలైన ఆ పిల్ల ఆప్యాయంగా చేసిన హెచ్చరిక శ్రీనాథుడి వెన్ను తట్టినట్లయింది.

చటుక్కున ఒక నిర్ణయానికి వచ్చి శ్రీనాథుడు రెండు కళ్లు తుడుచుకుని, తన సంచి చేతిలోనికి తీసుకొని చంచలమవుతున్న చిత్తాన్ని అదుపులో పెట్టుకుంటూ — "అమ్మా! నీవు నిర్ణయించిన బాటగుండానే నడుస్తానమ్మా! నువ్వు ఓడిపోలేదమ్మా! ఓడిపోవు. నన్ను ఆశీర్వదించు" అని వ్రాసి నల్లమ్మ చేతిలో పెట్టి గబగబా స్టేషను వైపు నడిచాడు శ్రీనాథుడు.

ఎనిమిది గంటలకి నిద్ర లేచిన రాము శ్రీనాథుడి జాడ తెలుసుకోలేక—'ఒత్తి పిరికివాడు. వాడి ఖర్మ నెవరు తప్పించగలరు? తల్లీ, తండ్రీ ఉండి కూడా, సవతి తల్లి చేతిలో పడ్డట్టు ఆ మహాతల్లి చేతిలో అవస్థలు పడతానంటాడు. చేతులారా తెచ్చి పెట్టుకున్నదాన్ని ఎవరు తప్పించగలరు' అనుకుని నిట్టూర్చి తమ్ముడి మీద జాలిపడ్డాడు. ★